క్లుప్తంగా

ప్రీస్కూల్ కిట్ల పంపిణీ



చిన్నారులకు ప్రీ స్కూల్ కిట్లు అందజేస్తున్న కౌన్సిలర్ విద్యారాణి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని బెంచికొట్టాల-1, రామిరెడ్డి కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా వార్డుల కౌన్సిలర్లు విద్యారాణి, లక్ష్మీదేవి చేతుల మీదుగా చిన్నారులకు ప్రీ స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్‌వాడీల అభివృద్ధి, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గుంతకల్లుటౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. గురువారం హనుమాన్‌సర్కిల్ వద్ద శ్రీశైల భ్రమరాంబిక జూనియర్ కళాశాలలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ బి.వసుంధర, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కె.నాయుడు, శివప్రియ ఫౌండేషన్ అధ్యక్షురాలు మనోప్రియ, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు రేణుక, కార్యదర్శి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్యం పారబోత



గుత్తి ఆర్ఎస్‌లోని మద్యం షాపులో మద్యం పారబోస్తున్న దృశ్యం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని మూడు మద్యం షాపుల్లో కాలం చెల్లిన, మిగిలిపోయిన క్లోవిస్ జో మద్యం బాటిళ్లను గురువారం అనంతపురం మద్యం డిపో పోలీసులు పారబోశారు. గుత్తిలోని ఓ షాపులో 144 , గుత్తి ఆర్ఎస్‌లోని రెండు బ్రాందీ షాపుల్లో 110 బాటిళ్ల మద్యాన్ని పారబోశారు. కార్యక్రమంలో మద్యం డిపో సీఐ గురునాథ్‌రెడ్డి, ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థానాలు అధిరోహించాలి

గుంతకల్లు రూరల్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని రోటరీక్లబ్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీకాంత్, శివానంద సూచించారు. గురువారం పులగుట్టపల్లి పెద్ద తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, సభ్యులు రాము, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు రేణుక కార్యదర్శి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా చిన్న సరిగెత్తు



శింగనమలలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

శింగనమల: శింగనమలలో గురువారం చిన్న సరిగెత్తు ఘనంగా జరిగింది. శింగనమలలోని అక్బర్‌చావిడి పీర్లు, కొడి పీర్లు, మూడు నాలుకల పీర్లు, దడెంపీర్లను ఊరేగించారు. శింగనమలకు గోవిందరాయునిపేట, చిన్నజలాలపురం, గురుగుంట్ల పీర్లను ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో శింగనమల, గోవిందరాయునిపేట, చిన్నజలాలపురం, గురుగుంట్ల, వెస్ట్ నరసాపురం, శివపురం, సీ.బండమీదపల్లి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ బాలకృష్ణయ్య, సిబ్బంది బందోబస్తు చేపట్టారు.
పెద్దవడుగూరు: మేడిమాకులపల్లి, తెలికి గ్రామాల్లో గురువారం పీర్ల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామాల్లో కొత్తగా వన్నూర్ స్వామి, బాబయ్య స్వామి, కుళ్లాయిస్వామి, అగ్గిదేవుడు, తెలికి మౌలాలీస్వామి, షేక్షావలి పీర్ల స్వాములను తయారు చేశారు. ఈసందర్భంగా గ్రామ వీధుల్లో పీర్లను ఊరేగించారు.

జేఆర్ఎఫ్ అభ్యర్థికి సన్మానం



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రానికి చెందిన కె. రాజశేఖర్ ఇటీవల యూజీసీ(యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్) జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో జేఆర్ఎఫ్(జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్)కు ఎంపికయ్యాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని యాడికి గ్రంథాలయంలో గురువారం రాజశేఖర్‌ను పంచాయతీ ఈఓ ఎర్రిస్వామి, గ్రంథాలయాధికారి మధుసూదన్, సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా సవరణ



శింగనమలలో బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఈశ్వరమ్మ



పామిడి: మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్ర

పామిడి: మండలంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పక్కాగా చేపట్టాలని గుంతకల్ ఆర్డీఓ జే రవీంద్ర అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సభా భవనంలో తహసీల్దార్ ఆర్‌వీ సునితబాయి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బూత్ లెవెల్ ఆఫీసర్ల (బీఎల్‌ఓ) అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎల్‌ఓలు తమకు కేటాయించిన మేరకు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. డబుల్ ఎంట్రీలు, డిలీషన్లను ఓటరు జాబితా నుంచి తొలగించడానికి పక్కా ఆధారాలు సేకరించాల్సి ఉంటుందన్నారు.
యాడికి: చంద్రాయుని గుడిసెలు గ్రామంలో ఓటర్ల జాబితా సవరణ సర్వేను తహసీల్దార్ అలెగ్జాండర్ గురువారం పర్యవేక్షించారు. బీఎల్వో(బూత్ లెవల్ ఆఫీసర్)లతో గ్రామంలోని పలు నివాసాలకు వెళ్లి ఓటర్లను పరిశీలించారు. లేని ఓటర్ల వివరాలు నమోదు చేసుకోవాలని, ఒకే ఇంటిలో ఎక్కువ మంది ఓటర్లు ఉంటే వారందరినీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని సర్వే సిబ్బందికి సూచించారు. మార్పులు, చేర్పులపై తహసీల్దార్ ఆరా తీశారు. మండలంలోని 55 పోలింగ్ కేంద్రాల పరిధిలో సర్వే చురుగ్గా సాగుతున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు. ఇదిలా ఉండగా సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణపై వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ అలెగ్జాండర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా పరిశీలనలో భాగంగా తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.
బుక్కరాయసముద్రం: బీఎల్‌ఓలు ఓటరు జాబితా తయారీలో జాగ్రత్తలు పాటించాలని శింగనమల నియోజకవర్గం ఓటరు నమోదు అధికారిణి సుధారాణి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓటరు నమోదు పక్రియను పరిశీలించారు. ముందుగా మండలంలో ఎంత మంది బీఎల్‌ఓలు ఉన్నారు, ఎన్ని పంచాయతీలున్నాయని, ఎంత మంది ఓటర్లు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. వచ్చే జనవరి 1 నాటికి 18 ఏళ్లు వయస్సు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటరు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను పరిశీలించి నమోదు చేయాలన్నారు. తహసీల్దార్ రమాదేవి, బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పక్కాగా చేపట్టండి

శింగనమల: గ్రామాల్లో ఓటరు నమోదు పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ ఈశ్వరమ్మ బీఎల్‌ఓలకు సూచించారు. గురువారం శింగనమలలోని 81, 82, 83 పోలింగ్‌బూత్‌ల బీఎల్‌ఓలతో మాట్లాడారు. నిబంధనలు ప్రకారం ఓటరు నమోదు చేపట్టాలన్నారు. కొత్త ఓటర్లును చేర్పించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణతో మాట్లాడారు. ఎల్‌ఓలు తాతయ్య, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులకు న్యాయం



గుత్తి: లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

గుత్తి: జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులకు న్యాయం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ పేర్కొన్నారు. పట్టణంలోని 12వ వార్డు సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 1,129 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులు, వైస్ చైర్‌పర్సన్లు బిందె వరలక్ష్మి, పద్మలత, కౌన్సిలర్లు కప్పలబండ సుచరిత, కేవీ రమణ, వరదరాజులు, నజీర్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా, జిల్లా నాయకులు మధుసూదన్‌రెడ్డి, గురుప్రసాద్‌యాదవ్, వార్డు ఇన్‌చార్జ్‌లు భాస్కర్‌రెడ్డి, ఆదిలక్ష్మి, రహీం నాయక్, గుత్తి టౌన్ సచివాలయ కన్వీనర్ రంగస్వామి, సచివాలయ నోడల్ ఆఫీసర్ కమ్ మున్సిపల్ మేనేజర్ మురళీధర్ పాల్గొన్నారు.
పామిడి: స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. తహసీల్దార్ ఆర్‌వీ సునీతబాయి, ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ బీవీ శశికళ, డిప్యూటీ తహసీల్దార్ ఈఓ పీ చంద్రశేఖర్, పార్టీ పట్టణ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్ లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత జోజోడే కుమార్, ఆయా వార్డుల ఇన్‌చార్జ్‌లు దాసరి కృష్ణ, కొండారెడ్డి, రామ్‌నాథ్‌రెడ్డి, లాలెప్ప తదితరులు పాల్గొన్నారు.
పెద్దవడుగూరు: విరుపాపురం, గుత్తిఅనంతపురం గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో 935 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ నాగభూషణ, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ వెంకటేశ్వరమ్మ, ఈఓఆర్డీ నాగేశ్వరశాస్త్రి, ఆర్ఐ శ్రీనివాసులు, సర్పంచు లు మురళీధర్‌రెడ్డి, రామాంజులరెడ్డి, సలోమి, మాజీ సర్పంచ్ బాలచంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని చేనేత కాలనీ, సుంకులమ్మపాలెం, సీపీఐ కాలనీ, కృష్ణాపురం-1,2 పరిధిలోని సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.రవి తెలిపారు. కార్యక్రమంలో ఆయా వార్డు సచివాలయాల పరిధిలోని ప్రజలు పాల్గొని ప్రభుత్వ సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

విశ్వమానవ హృదయ విజేత అబ్దుల్‌కలామ్



కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైస్ చైర్‌పర్సన్ మైమూన్, నాయకులు

గుంతకల్లుటౌన్: ఏపీజే అబ్దుల్‌కలామ్ విశ్వమానవ హృదయ విజేత అని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్ తెలిపారు. గురువారం వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం 8వ వర్ధంతి సందర్భంగా 60 అడుగుల రోడ్‌లోనున్న కలాం విగ్రహానికి వైస్ చైర్‌పర్సన్ పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశ అభివృద్ధికి కలాం అందించిన సేవల గురించి వివరించారు. కలాం నేటి యువతరానికి స్ఫూర్తిప్రదాత అమె తెలియజేశారు. నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ హొన్నూర్‌వలి, కౌన్సిలర్ సుమోబాషా, కోఆప్షన్‌సభ్యుడు ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, మైనార్టీ విభాగం మాజీ పట్టణ కన్వీనర్ జమీల్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఖలీల్, ఈద్గా ఫంక్షన్‌హాల్ చైర్మన్ మౌలా, 2వ వార్డు ఇన్‌చార్జ్ పీఎస్.మస్తాన్, మైనార్టీ నాయకులు ఖలీఫా, గఫార్, చాంద్‌పీరా, మహమ్మద్‌హుసేన్, తన్వీర్, సంచులబాషా, షాబుద్దీన్, దౌలా, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.
తాడిపత్రి అర్బన్: భారత్ మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ అని దూదేకుల నూర్‌బాషా సంఘం నేతలు కొనియాడారు. దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సభను గురువారం దూదేకుల సేవా సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా దూదేకుల సేవా సంఘం అధ్యక్షుడు నబిరసూల్ మాట్లాడుతూ అధికారం సమాజ శ్రేయస్సుకు వెచ్చించాలనే రాజ్యాంగ స్ఫూర్తికి ఏపీజే అబ్దుల్ కలాం ప్రాణం పోశారన్నారు. రెండోసారి రాష్ట్రపతి అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించారని గుర్తు చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. సంఘం కార్యదర్శి హుస్సేన్‌పీరా, నాయకులు మహబూబ్‌బాషా, దస్తగిరి, పెద్ద హాజీ, పెయింటర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

షికారీకాలనీలో డ్రైనేజీలు నిర్మించండి



షికారీ కాలనీలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణంలోని షికారీకాలనీలో సీసీ రోడ్డు, ఇరువైపుల డ్రైనేజీల నిర్మాణానికి సత్వరమే చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కాలనీలో మురుగునీరు నిలిచిపోయిందని వార్డు కౌన్సిలర్ సుధాకర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.రామలింగప్ప కాలనీని సందర్శించారు. కాలనీలో సీసీరోడ్డు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు బోరు వేయించి స్పాట్ డెలివరీ ట్యాంకును ఏర్పాటు చేయిస్తామని కమిషనర్ తెలియజేశారు. కాలనీలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేయించారు. డంపింగ్‌యార్డుకు వెళ్లే రహదారి మరమ్మతులతో తాత్కాలికంగా ఆలూరు రోడ్డులో ఉన్న డంపింగ్‌యార్డును ఆయన పరిశీలించారు. డీఈలు రామ్మూర్తి, హేమచంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఏఈ శ్రీకాంత్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



మాట్లాడుతున్న తహశీల్దార్ అలెగ్జాండర్

యాడికి: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని తహసీల్దార్ అలెగ్జాండర్, రాయలచెరువు సర్పంచు తలారి అరుణ వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులు పీహెచ్‌సీలో అందుతున్న సేవలు, రికార్డుల నిర్వహణ, సదుపాయాలు, సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సిబ్బంది ఆస్పత్రిలో అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. సమావేశంలో మహిళా మండలి కన్వీనర్ షేకున్‌బీ, వైద్యుడు దేవరాజ్, పీహెచ్ఎస్ సుమలత, సూపర్‌వైజర్ షబ్బీర్ పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించండి



కాంట్రాక్ట్ కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

గుంతకల్లు: రైల్వే కాంటాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల పోస్టులను కుదించడంపై రైల్వే యాజమాన్యానికి వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలను రైల్వేస్టేషన్‌లో కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రైల్వే బోర్డ్ కాంట్రాక్టర్ కార్మికులను తగ్గించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. వందలాది మంది కాంటాక్ట్ కార్మికులు రోడ్డును పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే ఖాళీగా ఉన్న రైల్వే పోస్టులను భర్తీ చేయకుండా ఉన్న ఉద్యోగాలను కూడా సరెండర్ పేరుతో రద్దు చేస్తున్నారన్నారు. రైల్వే బోర్డు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డీఆర్ఎం కార్యాలయం వద్ద కాంటాక్ట్ కార్మికులతో నిరసన తలపెట్టినట్లు ఆయన తెలిపారు. సీఐటీయూ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, నాయకులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

గుంతకల్లుటౌన్: దేశంలోని అన్నదాతల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ విశ్వనాథ్ తెలిపారు. గురువారం పట్టణంలో పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా గుర్తించబడిన ఫర్టిలైజర్ షాపుల వద్ద ప్రధాన్‌మంత్రి కిసాన్ సమృద్ధి యోజన పథకం ప్రారంభోత్సవం, ఆయన సందేశాన్ని రైతులకు వినిపించేందుకు కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 2.8 లక్షల ఫర్టిలైజర్ షాపులను కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేశారని, అందులో తొలిదశలో 1.25 లక్షల షాపులను ప్రారంభించారన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాఘవేంద్ర, నాయకులు బండారు కృష్ణమూర్తి, సూర్యనారాయణ, మహేష్, ఆదిరెడ్డి, క్రిష్ణమూర్తి, ఫర్టిలైజర్ షాపు యజమానులు పాల్గొన్నారు.
పామిడి: స్థానిక దుర్గా ఫర్టిలైజర్ షాపులో గురువారం పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాల ప్రారంభ కార్యక్రమాన్ని రైతులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో ఏఓ డీ లీనా వసుంధర, ఏఈఓ శ్రీనివాసరావు, బీజేపీ మండలాధ్యక్షుడు అంజినాయక్, దుర్గా శీనా, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

తాడిపత్రి: యర్రగుంటపల్లి వద్ద తాడిపత్రి - అనంతపురం ప్రధాన రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. యర్రగుంటపల్లికి చెందిన కిట్టప్ప పశువులు మేపేందుకు వెళ్తుండగా నార్పలకు చెందిన రామాంజనేయులు బైక్‌పై వస్తూ, కిట్టప్పను ఢీ కొన్నాడు. కిట్టప్పకు కాలు విరగడంతో 108లో తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆసుపత్రిలో అన్నదానం

పామిడి: స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో గురువారం అబ్దుల్‌కలామ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 200 మంది రోగులకు అన్నదానం చేశారు. ఆసంస్థ సభ్యుడు, దివంగత డీవీ గంగాధర్ 12వ వర్ధంతిని పురస్కరించుకుని సంస్థ సభ్యులు, ఆరోగ్యమిత్ర బోయ బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. వైద్యులు మౌనిక, అరుణ, శివకార్తీక్‌రెడ్డి, సంస్థ సభ్యులు రవి, రాము, విజయ్, హుస్సేన్, పురుషోత్తం, గోపి, సంపత్, ఓబులేసు, సోమశేఖర్ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండండి



రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం: జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు అందుబాటులో ఉండి పంట సాగులో సూచనలివ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ సిబ్బందిని ఆదేశించారు. గురువారం దయ్యాలకుంటపల్లిలో రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎరువుల అమ్మకాలు, విత్తన పంపిణీ, యాంత్రీకరణ, క్రాప్ బుకింగ్, పంటల బీమా రికార్డులను పరిశీలించారు. ఏఓ శ్యాం సుందరరెడ్డి, టెక్నికల్ ఏఓ బాలా నాయక్, ఉద్యాన సహాయకుడు నరేష్ పాల్గొన్నారు.
నార్పల: ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఎరువుల, విత్తనాలు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. గురువారం ఆమె నార్పల-2, కేసేపల్లి రైతు భరోసా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంటల నమోదు తప్పనిసరిగా చేయాలని సిబ్బందికి సూచించారు. ఏఓ చిన్నవీరస్వామి ఉన్నారు.

బైక్ అపహరణ

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో బైక్‌ను అపహరణకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన నారాయణస్వామి వాల్మీకి విగ్రహం వద్ద టూవీలర్ రిపేరు షాపు నిర్వహిస్తున్నాడు. బైక్‌ను 4 రోజుల క్రితం షాపులో ఉంచి వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను ఎత్తుకెళ్లారు. గమనించిన బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

పెద్దవడుగూరు: చిన్నవడుగూరులో ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించింది. వివరాలు.. గ్రామానికి చెందిన గంగమ్మ గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు ఆమెను పామిడికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

డీసీసీబీ ద్వారా విరివిగా రుణాలు

అనంతపురం అగ్రికల్చర్: అన్ని వర్గాల అభివృద్ధికి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ద్వారా విరివిగా రుణాలు ఇస్తామని ఆ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.లిఖిత తెలిపారు. గురువారం స్థానిక డీసీసీబీ హాలులో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ఆప్కాబ్, నాబార్డు సహకారంతో రైతులకు విరివిగా పంటరుణాలు ఇవ్వడంతో పాటు దీర్ఘకాలిక రుణాలు (ఎల్‌టీ), పాడి పశుపోషణ, మహిళా సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు కూడా అర్హత కలిగిన వారికి రుణాలు ఇవ్వడానికి బ్రాంచ్ మేనేజర్లు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలకు రుణ భాగస్వామ్యం కల్పించినందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు బ్యాంకు టర్నోవర్ రూ.2 వేల కోట్ల మార్క్‌ను చేరుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలి

పుట్లూరు: అంగన్‌వాడీ కేంద్రాలో పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని సీడీపీఓ భారతి అన్నారు. గురవారం ఆమె కడవకల్లు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సెక్టార్ సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ సెంటర్లపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధిని జీర్ణించుకోలేకే ఆరోపణలు

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆరోపణలు చేస్తున్నారని ఎస్సీసెల్ మండల కన్వీనర్ వరికూటి కాటమయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. పేదలకు చేస్తున్న అభివృద్ధిని చూసి సీఎం జగన్‌పై కుట్ర రాజకీయాలు చేస్తున్నారన్నారు. బీకేఎస్‌లో వార్డు మెంబర్‌కు కూడా గెలవలేని వారు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిపై విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. స్థాయిని బట్టి మాట్లాడాలని హితవు పలికారు.

జూదరుల అరెస్టు

పెద్దవడుగూరు : క్రిష్టిపాడు సమీపంలో పేకాట ఆడుతున్న 11 మందిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. నిందతుల నుంచి రూ.20,090 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు రూరల్: మండలంలోని స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ మురళికి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు సాకే నాగరాజు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్మికుల జీవితాలు మాత్రం దుర్భరంగా ఉన్నాయన్నారు. రూ.20 వేల కనీస వేతనం అందించాలని కోరారు.
గార్లదిన్నె: తమను రెగ్యులర్ చేయాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు.గురువారం మండల కేంద్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ వర్కర్లు ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ. 20వేలు చెల్లించాలన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులను పంచాయతీ కార్మికులుగా గుర్తించి రూ.10 వేలు వేతనం ఇవ్వాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ తేజోత్స్నకు అందజేశారు. పంచాయతీ కార్మికులు రాజశేఖర్, ఓబిలేసు, నల్లప్ప, వెంకటప్ప, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్‌గా రవీంద్ర



ఎంపీడీఓతో నియామకపత్రం అందుకుంటున్న రవీంద్ర

పామిడి: స్వచ్ఛ భారత్ మిషన్-2 మండల రీసోర్స్ కో-ఆర్డినేటర్‌గా వీ రవీంద్ర నియమితులయ్యారు. గురువారం ఈ మేరకు ఉత్తర్వులను ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ రవీంద్రకు అందజేశారు. ఈసందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో ప్రభుత్వ లక్ష్యసాధనకు కృషి చేస్తానన్నారు.



శివయ్య

తాడిపత్రి: స్వచ్ఛభారత్ మిషన్ - 2 మండల రిసోర్సు కో ఆర్డినేటర్‌గా జి. శివయ్య గురువారం బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీఓ రంగారావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శివయ్య తన నియామక పత్రాన్ని ఎంపీడీఓకు అందజేశారు.

సీఐటీయూ నిరసన ర్యాలీ

తాడిపత్రి అర్బన్: ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు గురువారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించారు. ఈసందర్భంగా సీఐటీయూ అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ 60 ఏళ్లు పూర్తయిన, మృతి చెందిన కార్మికుల వారి స్థానంలో కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలన్నారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మిక సిబ్బందిని పెంచాలన్నారు. సబ్బులతో పాటు చెప్పులను కూడా అందజేయాలని కోరారు. అనంతరం కమిషనర్ రవికి వినతిపత్రం అందజేశారు.

పీహెచ్‌డీ భారతికి సన్మానం

శింగనమల: నాగులగుడ్డంకు చెందిన పీహెచ్‌డీ భారతిని గురువారం అనంతపురంలోని సోషల్ వెల్ఫేర్ అధికారి కార్యాలయంలో జిల్లా గిరిజన అధికారి అన్నాదొరై, సోషల్ వెల్ఫేర్ జేడీ మధుసూదన్, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి సన్మానించారు. జిల్లా గిరిజన సమాఖ్య నాయకులు రవికుమార్ నాయక్, ఎమ్మార్పీఎస్ నేత జయప్రకాష్ పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ

పుట్లూరు: అరకటివేముల గ్రామ సచివాలయాన్ని గురువారం ఎంపీడీఓ యోగానందరెడ్డి తనిఖీ చేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. వలంటీర్లు తమకు కేటాయించిన క్లస్టర్లలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు.